ఆత్మీయ సత్కారం


మౌనశ్రీ మల్లిక్‌కు పురస్కారంతో సత్కరిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

చిక్కడపల్లి: సత్య సంగీత ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయ గానసభలో సి.నారాయణరెడ్డి సంగీత సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక చైతన్యమూర్తులకు ఆత్మీయ సత్కారం చేశారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా హాజరై ప్రముఖ కవి, సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్‌కు సినారె సత్య సంగీత జాతీయ సాహితీ పురస్కారం ప్రదానం చేశారు. అదే విధంగా వివిధ రంగాల నుంచి ఎంపిక చేసిన ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. తొలుత నిర్వహించిన సినీసంగీత విభావరి అందరిని అలరించింది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఓంకార్‌రాజు, ప్రముఖులు వంశీ రామరాజు, మాణిక్, దైవజ్ఞశర్మ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ సుబ్బలక్ష్మి యాదిలో..


ఎంఎస్ సుబ్బలక్ష్మికి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

చిక్కడపల్లి: భారతీయ సంగీతాన్ని ఉన్నతస్థాయిలో నిలిపిన ఎంఎస్ సుబ్బలక్ష్మి అని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా కొనియాడారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ నిర్వహణలో కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎంఎస్ సుబ్బలక్ష్మి యాదిలో.. శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మధ్య తరగతి కుటుంబంలో జన్మించి సంగీత సాధన చేస్తూ ఉన్నంత స్థాయికి ఎదిగారన్నారు. సంగీత రంగంలో భారతరత్న అందుకున్న ఆమె సంపాదించిందంతా దాన ధర్మాలు చేసి చివరిదశలో పేదరికంతో గడిపారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు పొత్తూరి సుబ్బారావు వెంకట్రావు, చక్రపాటి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


నర్సింగ్‌రావును పరామర్శిస్తున్న ముఠా జైసింహ

ముషీరాబాద్: కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ముషీరాబాద్ నియోజకవర్గ ఫ్రీలాన్సర్ ఫొటోగ్రాఫర్ నర్సింగ్‌రావు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చారు. బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ శుక్రవారం రాంనగర్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. వైద్యం నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. నర్సింగ్‌రావు త్వరగా కోలుకుని చురుకుగా వృత్తిలో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ వీరారెడ్డి, కనకరాజు, శివకుమార్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు శివముదిరాజ్, రాకేష్, శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అజంతా ఎక్స్‌ప్రెస్ రైల్లో చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి బ్యాగులో నుంచి అమెరికన్ డాలర్లు, నగదును దొంగిలించిన సంఘటనపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... నేరేడ్‌మెట్ ప్రాంతానికి చెందిన సాయికిరణ్ (36) కాచిగూడకు రావడానికి శుక్రవారం సాయంత్రం నాగర్‌సోల్‌లో అజంతా ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. నిజామాబాద్‌లో తన బ్యాగు కనిపించలేదు. బ్యాగుల ఎయిర్ బర్డ్స్, రిస్ట్ వాచ్, రూ.22వేల నగదు, 150 అమెరికన్ డాలర్స్ ఉన్నాయి. బాధితుడు శనివారం కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసును నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (35) జూకల్ – ఉందనగర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గబ్బుగబ్బు చేస్తున్నయ్.!

వాకర్స్, సందర్శకులపై రెట్టలు వేస్తున్న కొంగలు


సుందరయ్య పార్కులో దర్శనమిస్తున్న కొంగలు

- పార్కు ప్రాంగణం మొత్తం కొంగల మలమూత్ర వ్యర్థాలు
- కొంగలకు అడ్డాగా మారిన సుందరయ్య పార్కు
- దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్న సందర్శకులు


పార్కులో ఉన్న దిమ్మెలపై కూర్చోవడానికి వీలు లేకుండా ఉన్న కొంగల వ్యర్థాలు


పార్కులో చనిపోయిన కొంగ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రతిష్టాత్మకమైన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు కొంగల కొలనుగా మారింది. పది నెలల నుంచి వాకర్స్‌ను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వందలాది కొంగలు పార్కు చుట్టూ ఉన్న చింత చెట్లపై గూడు కట్టుకొని తిష్టవేశాయి. కొంగలు విసర్జించే మలమూత్రాలు కుప్పలు తెప్పలుగా పేరుకు పోయి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. పార్కు పరిసర ప్రాంతాల్లో వాకర్స్ కూర్చోవడానికి వేసిన దిమ్మెలు, బల్లలపై కొంగల వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. అరుగులపై పడ్డ మలమూత్రాలను ఎంత కడిగిన కూడా అవి పోవడం లేదు. ముఖ్యంగా కొంగలు వాకర్స్ తిరుగుతున్న క్రమంలో కాళ్ల చుట్టూ కదలడంతో పాటు అక్కడక్కడ మృతి చెంది పడిపోతున్నాయి. రోజు కనీసం 4, 5 కొంగులైనా కింద పడి చనిపోతున్నాయి.


వాకర్స్ ట్రాక్ సమీపంలో దర్శనమిస్తున్న కొంగలు

వాకర్స్ మీద విసర్జన..

ప్రతిరోజు వందలాది కొంగలతో ఇబ్బంది పడుతున్న వాకర్స్‌కు వాకింగ్ చేసే సమయంలో వాకర్స్ నెత్తిపైన , దుస్తులపైన మలాన్ని విసర్జిస్తున్నాయి. దీంతో చాలా మంది పార్కుకి రావడానికి ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు మహిళలు, వాకింగ్ చేయడానికి ఆసక్తి చూపడం లేదు. నిత్యం వందలాది మందితో కలకలలాడే ఈ పార్కు వెలవెలబోతుంది. వీటి వ్యర్థాలు ఎండి గాలిలో కలిసిపోతున్నాయి. చింత చెట్టు కింద కూర్చుని గాలి పీల్చే వారికి ఊపిరితిత్తుల సమస్య తలెత్తే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

సంవత్సరంలో రెండు నెలలే ఉండేవి...

గతంలో సంవత్సరానికి రెండు నెలలు ఉండిపోయే కొంగలు పది నెలలుగా తిష్టవేయడంతో వాకర్స్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్కు వాకర్స్ అసోసియేషన్ చొరవ తీసుకొని చిన్నచిన్న కొమ్మలు కొట్టి వేయడంతో అక్కడ కొన్ని కొంగలు చనిపోయాయని ఎవరో ఓ అజ్ఞాత వ్యక్తి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కొమ్మలను నరికివేసిన జీహెచ్ఎంసీ సిబ్బందికి రూ.25వేల జరిమానా విధించడం కూడా జరిగింది. 20 రోజుల క్రితం జీహెచ్ఎంసి కమిషనర్‌తో పాటు ఇతర అధికారులు కూడా పార్కును సందర్శించి కొంగల బెడదను నివారిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు ప్రారంభించలేదని వాకర్స్ చెబుతున్నారు.

భరించలేని దుర్వాసన



ఈ పార్కుకి రావాలంటే భయమేస్తుంది. భరించలేని దుర్వాసన వస్తుంది. వాకింగ్ చేస్తున్నప్పుడు కొంగలు మలాన్ని విసర్జన చేయడంతో దుస్తులన్ని పాడవుతున్నాయి. నెత్తిన కూడా పడుతుండడంతో అసహ్యం వేస్తుంది. ఇప్పటికైన మా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. నగరంలో సుప్రసిద్ధమైన ఈ పార్కు పట్ల నిర్లక్ష్యం తగదు.

– ఎస్.మనోహర్‌రెడ్డి, వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి

పట్టించుకోవడం లేదు...



పార్కులో కొంగల బెడదపై జీహెచ్ఎంసీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. కమిషనర్ సైతం పర్యటించినా సమస్యకు పరిష్కారం లభించలేదు. తాత్కాలిక ఉపశమనం కోసం చెట్లకొమ్మలను కొట్టేస్తే కొంగలు చనిపోతున్నాయనే నేపంతో సిబ్బందికి రూ.25వేల జరిమానా విధించారు. మనుషుల ప్రాణాల కంటే అధికారులు కొంగలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి వచ్చే వారు ఈ కొంగల వల్ల అనారోగ్యం బారిన పడుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.

– పీవీ నిరంజన్‌రెడ్డి, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు

ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి


లంకబస్తీలో డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ లావణ్య

అంబర్‌పేట: నియోజకవర్గంలో ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం గోల్నాక డివిజన్ లంకబస్తీలో రూ.12 లక్షల డ్రైనేజీ పైపులైన్ పనులను కార్పొరేటర్ లావణ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాలం చెల్లిన పైపులైన్ వ్యవస్థను దశల వారీగా తొలగిస్తున్నామని అన్నారు. అందుకే కొత్తగా పైపులైన్ చేపడుతున్నామని పేర్కొన్నారు. నిర్మాణంలో నాణ్యాత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

లంకబస్తీలో ఎమ్మెల్యే పాదయాత్ర

అనంతరం లంకబస్తీలో ఎమ్మెల్యే పాదయాత్ర చేసి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ప్రధానంగా బస్తీలో పాములు, దోమలు, వీధిలైట్ల సమస్యలు ఉన్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం శ్రీధర్, మేనేజర్ రోహిత్, బీఆర్ఎస్ నాయకులు బుచ్చిరెడ్డి, బి.నర్సింగ్‌రావు యాదవ్, మల్లేశ్, అంజయ్య, దేవందర్ పాల్గొన్నారు.

జానపద కళాకారుల సమస్యలను పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కొండూరు భాస్కర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో జానపద వృత్తి కళాకారుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి కొండూరు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొండూరు భాస్కర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో కళనే వృత్తిగా నమ్ముకుని జీవిస్తున్న కళాకారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడుస్తున్నా జానపద కళాకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయడం లేదన్నారు. కళాకారులకు గుర్తింపు కార్డు ఇవ్వడంతో పాటు వృద్ధా కళాకారులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కళాకారులందరికీ ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లలో ప్రత్యేక కోటా కేటాయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మారన్న, జనార్దన్, మైసయ్య, సోమక్క, యాదయ్య, కిషోర్, పద్మ, ఉపేందర్, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజా బహదూర్ వెంకటరామారెడ్డి జయంతి


నివాళులర్పిస్తున్న ఉపకులపతి ప్రొ. నిత్యానందరావు, ప్రిన్సిపాల్ డా. అచ్యుతదేవి తదితరులు

కాచిగూడ: మహిళా విద్యాభివృద్ధికి రాజా బహదూర్ వెంకటరామారెడ్డి అందించిన సేవలు మరువలేనివని తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. నిత్యానందరావు అన్నారు. బర్కత్‌పురలోని ఆర్‌బీవీఆర్ఆర్ మహిళా కళాశాలలో శుక్రవారం రాజా బహదూర్ వెంకటరామారెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి అధ్యాపకులతో కలిసి ఆయన నివాళులర్పించారు. సమాజ సేవకుడిగా హైదరాబాద్ తొలి కొత్వాల్‌గా రాజా బహదూర్ దూరదృష్టితో మహిళల విద్యా ప్రాధాన్యాన్ని గుర్తించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. డాక్టర్ అచ్యుతాదేవి, వైస్ ప్రిన్సిపల్ కె.సిందూరి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో మా పోరాటాన్ని అడ్డుకోలేరు

సచివాలయం ముట్టడి.. ఎక్కడికక్కడే బీజేపీ నేతల కట్టడి



ప్రజా సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ఎండగట్టేందుకు బీజేపీ రాష్ట్ర అధిష్టానం సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల పార్టీ నేతల శుక్రవారం సచివాలయ ముట్టడికి బయల్దేరారు. ఈ సందర్భంగా పోలీసులు మార్గ మధ్యలోనే నేతలు, కార్యకర్తలను అరెస్టు చేశారు. కొందరినైతే గృహ నిర్బంధం చేసి కట్టడి చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... అక్రమ అరెస్టులతో తమ పోరాటాన్ని అడ్డుకోలేరని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ప్రజా సమస్యలను తుంగలో తొక్కుతూ పాలనను గాలికి వదిలేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే నగరంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. లేకుంటే పరిష్కరించే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు.

– అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ బృందం

రైల్లో ఆభరణాలు, నగదు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ పెళ్లి కుటుంబానికి చెందిన బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురైన సంఘటనపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... అమీర్‌పేటకు చెందిన వై.వెంకటేశ్వర్ రావు (62) కూతురు మ్యారేజ్ బెంగుళూర్‌లో జరిగింది. కూతురు పెళ్లి కోసం ఈనెల 6వ తేదీన వెంకటేశ్వర్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి బెంగుళూర్‌కు వెళ్లారు. బెంగుళూర్ యశ్వంతపూర్‌లో సూట్‌కేస్ తీసి చూసుకునే సరికి అందులో 578 గ్రాముల (57 తులాల) బంగారు ఆభరణాలు, రూ.ఒక లక్ష నగదు కనిపించలేదు. దీంతో శనివారం వెంకటేశ్వర్‌రావు కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం యశ్వంత్‌పూర్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందేలా చూస్తా

మాజీ ఎంపీ వి.హనుమంతరావు

అంబర్‌పేట: గణేష్ మండపం ఏర్పాటు చేస్తుండగా బాగ్‌అంబర్‌పేటలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన యువకుడి కుటుంబాన్ని మాజీ ఎంపీ వి.హనుమంతరావు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడు రామ్ చరణ్‌తేజ కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం తరపున రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని మంత్రి శ్రీధర్‌బాబుకు లేఖ రాశానని వీహెచ్ తెలిపారు. గణేష్ మండపాలు ఏర్పాటు చేసే సమయంలో నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


మృతుడు రామ్ చరణ్‌తేజ కుటుంబీకులతో వీహెచ్, కాంగ్రెస్ నేతలు

'విద్యాశాఖను సీఎం గాలికొదిలేశారు'


బాగ్‌లింగంపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గడ్డం నాగార్జున

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖను గాలికి వదిలేశారని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున విమర్శించారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో జరిగిన సమావేశంలో గడ్డం నాగార్జున మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు గడుస్తున్నా విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని పరోక్షంగా అమలు చేస్తూ ప్రభుత్వ విద్యను పట్టించుకోవడం లేదన్నారు. 2, 253 ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేదన్నారు. 1500కు పైగా పాఠశాలలో టాయిలెట్ల సౌకర్యం లేదని తెలిపారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం పాఠశాలలో బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని తీసుకువచ్చిందని దానిని కూడా అమలు చేయడంలేదని వాపోయారు. మధ్యాహ్న భోజనానికి పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులు పెంచకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సావిత్రి, జబ్బర్ నాయక్, ఎండీ మోసిన్, వస్కుల భరత్, కాశీ, టి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి


ధర్నా చౌక్‌లో శాంతియుత నిరసన తెలుపుతున్న తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నేతలు

కవాడిగూడ: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రేషన్ డీలర్లకు కనీస వేతనం రూ.5వేలతో పాటు కమీషన్‌ను వెంటనే పెంచాలని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నాచౌక్‌లో శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేషన్ డీలర్లకు చెల్లిస్తున్న కమీషన్ ప్రతినెల చెల్లించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా గుర్తించి నిత్యావసరాలను పేదలకు అందుబాటులో ఉంచాలన్నారు. రేషన్‌కార్డుల బైఫరికేషన్ విధానాన్ని నిలిపేసి కొత్త షాపుల ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలోక్ష 800 రేషన్‌కార్డులు, పట్టణ ప్రాంతాలలో 1200 కార్డులకు పైన ఉన్న రేషన్‌షాపులను మాత్రమే బైఫరికేషన్ చేయాలన్నారు. రేషన్ దుకాణాల అద్దెను ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. డీలర్లకు విద్యార్హతను బట్టి శాఖాపరమైన పదోన్నతులు కల్పించాలని కోరారు. రెండేళ్లకోసారి చేపట్టే 'ఆథరైజేషన్ రెన్యువల్'ను రద్దు చేసి శాశ్వత ప్రతిపాదికన కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి మల్ల హనుమండ్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, కోశాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మోహన్‌నాయక్, చీఫ్ అడ్వైజర్ ఎండీ సాధిక్‌పాషా, శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పరస్పర సహకారంతో పండుగ చేసుకుందాం

- గాంధీనగర్ సబ్ డివిజన్ ఏసీపీ యాదగిరి
- గణేష్ మండప నిర్వాహకులు, పోలీసుల సమావేశం
- సహకరిస్తే ఉత్సవాలను విజయవంతం చేయొచ్చని వెల్లడి

కవాడిగూడ: రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు మండప నిర్వాహకులు సహకరించాలని గాంధీనగర్ సబ్ డివిజన్ ఏసీపీ యాదగిరి కోరారు. బండమైసమ్మనగర్ కమ్యూనిటీహాల్‌లో దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గణేష్ మండప నిర్వాహకులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఏసీపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనుమతులు లేకుండా నిబంధనలు పాటించకుండా గణేష్ మండపాలు ఏర్పాటు చేయొద్దన్నారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా మండపాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మండపం ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో కేబుల్ వైర్లు, చెట్ల కొమ్మలు అడ్డుగా వస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సొంత నిర్ణయాలు తీసుకుని ప్రమాదాల బారిన పడొద్దన్నారు. తామే ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

డీజేకు అనుమతి లేదు...

నిమజ్జన ఊరేగింపులో డీజేకు అనుమతి లేదని ఏసీపీ స్పష్టం చేశారు. మండపాల పరిసరాల్లో అనుమానస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీసులకు మండప నిర్వాహకులు భక్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఊరేగింపులో డీజే సిస్టమ్ కనిపిస్తే సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

ఎన్టీఆర్ స్టేడియంలో చిన్న విగ్రహాల నిమజ్జనం..

ప్రతి సంవత్సరం లాగానే చిన్న గణపతులను నిమజ్జనం చేయడానికి ఎన్టీఆర్ స్టేడియంలో నీటి కొలనులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. చిన్న గణపతుల మండప నిర్వాహకులు ఇక్కడే నిమజ్జనం చేసి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, విజయ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోండి

కాచిగూడ: గణేష్ మండపాల నిర్వాహకులు ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ ఈస్ట్‌జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శరత్‌శ్యామ్ కోరారు. చెప్పల్‌బజార్ గణేష్ విగ్రహ ఆర్గనైజర్ సాయిబాబాకు శుక్రవారం ఆయన గ్లౌజ్‌లు, విద్యుత్ టేపులు, టెస్టర్లు అందజేశారు. మండపాల నిర్వాహకులకు పోలీసులతో పాటు సెంట్రల్ పీస్ కమిటీ అండగా ఉంటుందని తెలిపారు.



బండమైసమ్మ నగర్ కమ్యూనిటీహాల్‌లో మండప నిర్వాహకులతో మాట్లాడుతున్న ఏసీపీ యాదగిరి

ముషీరాబాద్‌లో బీజేయూఎస్ కార్యాలయం ప్రారంభం

ముషీరాబాద్: నియోజకవర్గ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యాలయాన్ని ముషీరాబాద్ ప్రధాన రహదారి హెరిటేజ్ ఫంక్షన్‌హాల్ పక్కన ఏర్పాటు చేశారు. ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ మద్దూరి శివాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని బీజేయూఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశిధర్, కార్యదర్శి ఆలే భాస్కర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, బీజేయూఎస్ సభ్యులు శక్తిసింగ్, రాజ్‌కుమార్, మహేంద్రబాబు, అరుణ్, జైపాల్, పార్ధసారధి, పరిమల్‌కుమార్ పాల్గొన్నారు.

